# పోర్టల్ పక్కదారి

-మొదటిపేజీ తరువాయి

జనగామ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా భూభారతి పోర్టల్లో సాగు భూముల రిజిస్ట్రేషన్లకు చెల్లించాల్సిన సొమ్ము పక్కదారి పడుతున్నట్లు గుర్తించారు. వీరికి యాదగిరిగుట్టకు చెందిన ఓ ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు సహకరిస్తున్నట్లు తేల్చారు. జనగామ తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయగా... తీగ లాగడంతో డొంకంతా కదిలింది. నాటి ధరణి, నేటి భూభారతి పోర్టల్‌ల వేదికగా సాగు భూముల రిజిస్ట్రేషన్లు మ్యుటేషన్లు, గిఫ్ట్ డీడ్ తదితర లావాదేవీలను కొందరు దోపిడీకి అడ్డాగా మార్చుకున్నారు. రైతులు భూమి రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ సెంటర్‌కు వస్తుంటారు. సర్వే నంబరు ఆధారంగా విస్తీర్ణాన్ని బట్టి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లిస్తుంటారు. వారు చెల్లించే మొత్తాన్ని ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ ఖజానాలో జమ కాకుండా సాఫ్ట్‌వేర్ ఉపయోగించి కొల్లగొడుతున్నారు. రూ.లక్షకు రూ.10 వేలు మాత్రమే ఖజానాకు చేరేలా చేసి మిగిలిన మొత్తాన్ని దారిమళ్లిస్తున్నారు.

**రూ.48 కోట్లు... రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో ఎక్కువ**

2020 నవంబరు 2 నుంచి సాగు భూముల పోర్టల్ ధరణి అమల్లోకి వచ్చింది. టెర్రా ఐసిస్ అనే ప్రైవేట్ సంస్థ దీని నిర్వహణ చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంస్థ నుంచి ధరణి డేటాను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్‌ఐసీ)కి మార్చింది. సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లొసుగులను వాడుకుని కొందరు ఈచలానా రూపంలో చెల్లించే సొమ్ములను దారిమళ్లిస్తున్నారు. పోర్టల్లో ఇప్పటివరకు 50 లక్షల లావాదేవీలు చోటుచేసుకున్నట్లు అంచనాలున్నాయి. వాటిలో రెవెన్యూశాఖ జల్లెడ పట్టినంత వరకు రూ.48 కోట్ల మొత్తం దారిమళ్లినట్లు గుర్తించారు. ఇందులో రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన లావాదేవీలే ఎక్కువగా ఉన్నాయి.

**పెద్ద ముఠా.. భారీ వ్యూహం**

ధరణి పోర్టల్ ఏర్పాటైనప్పటి నుంచి రైతులు ఎంత చెల్లిస్తున్నారు... ఎన్ని లావాదేవీలు జరుగుతున్నాయి... రెండింటికి మధ్య పొంతన ఉందా అనే వివరాలను గుర్తించే ఆడిటింగ్ లేదు. నిందితుల ఈదోపిడీకి ఇదే కారణంగా నిపుణులు అంచనా వేస్తున్నారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో ఒక ముఠాను పోలీసులు గుర్తించారు. యాదగిరిగుట్టకు చెందిన బస్వరాజ్ అనే ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు చుట్టుపక్కల ఆన్‌లైన్ సెంటర్లకు ఈచలానా చెల్లింపుల్లో సాయం చేస్తున్నట్లు తేల్చారు. ఇందుకు ఆ ఆన్‌లైన్ సెంటర్ల వారికి ఒక్కో లావాదేవీకి రూ.5 వేల చొప్పున చెల్లిస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో భారీ ధరలున్న భూముల లావాదేవీల విషయంలో పెద్దఎత్తున దోపిడీ జరిగినట్లు, ఇందులో పలువురు తెరవెనుక ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆరేళ్ల నుంచి కొందరు ఈచోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

**సాఫ్ట్‌వేర్ రక్షణను దాటి...**

భూముల లావాదేవీలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అనుగుణంగానే రూపొందించినా... అందులోని కొన్ని లొసుగుల్ని నిందితులు పసిగట్టారు. ఈచలానా చెల్లించినట్లు చెల్లించి తిరిగి వెనక్కి తీసుకోవడం, చెల్లించిన మొత్తంలో చివర ఉన్న అంకెలను మార్చి (రూ.1,50,000 అయితే రూ.1,500) తక్కువ మొత్తానికి చలానా సృష్టించి పోర్టల్‌లోని అప్లికేషన్‌కు చెల్లింపుల అప్లికేషన్ జత చేయడం చేస్తున్నారు. దీనికోసం దోపిడీదారులు ఒక మాల్‌వేర్ లేదా యాప్‌ను సృష్టించి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, ఈచలానా చేరాల్సిన బ్యాంక్ గేట్‌వే వద్ద దోపిడీ చేస్తున్నారా లేదా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు డబ్బులు జమ అయ్యే సమయంలో దాన్ని ఏమార్చుతున్నారా అనేది సాఫ్ట్‌వేర్ నిపుణులు పరిశోధన చేస్తున్నారు. 10 నుంచి 40 నిమిషాల్లో పూర్తయ్యే రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంతా పకడ్బందీగా జరుగుతుంది. ఇంత తక్కువ సమయంలో ఎలా దోపిడీ చేస్తున్నారనేది అంతుచిక్కడం లేదు. లేదా స్లాట్ నమోదు చేసిన రోజునే పోర్టల్లోకి చొరబడి అక్కడే కొల్లగొడుతున్నారా అనేది అన్వేషిస్తున్నారు.

**రెవెన్యూ అధికారుల పాత్రపై ఆరా!**

రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ప్రింట్ అయ్యే డీడ్ పత్రాలపై భూమి మార్కెట్ విలువ, చెల్లించాల్సిన ఛార్జీ మొత్తం, రైతు చెల్లించిన వివరాలన్నీ ప్రచురితమవుతాయని సీసీఎల్‌ఏ అధికారులు చెబుతున్నారు. పోర్టల్ నుంచే ఆటోమేటిక్ విధానంలో ఈ వివరాలు తహసీల్దారు వద్ద ప్రింట్‌లో వస్తాయని... ఆ తరువాత తహసీల్దారు సంతకం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ సమయంలో గుర్తించే వీలున్నా ఎందుకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే అంశంపై విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూశాఖ అప్రమత్తమైంది. రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ కలెక్టర్లతో పాటు ఎన్‌ఐసీలోని నిపుణులనూ అప్రమత్తం చేశారు. పలు జిల్లాలకు చెందిన లావాదేవీల ఈఫైళ్లను వడపోసి కొన్ని వారికి సమాచారం అందజేసినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో దేవరకద్ర, రాజాపూర్ మండలాలకు చెందినవి కూడా ఉన్నాయని సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. భూభారతి ద్వారా జనగామలో నిధులు పక్కదారి పట్టడంపై నివేదిక సమర్పించాలంటూ ప్రభుత్వానికి లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జనగామ జిల్లాలో ఒకేరోజు రూ.8 లక్షల రిజిస్ట్రేషన్ ఛార్జీలను పక్కదారి పట్టించిన విషయం పత్రికల్లో ప్రచురితం కావడంతో లోకాయుక్త సుమోటోగా తీసుకుంది.

**వడపోస్తున్నాం..కఠిన చర్యలు తప్పవు**
**పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి**

ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆధారంగా చేసుకుని కొందరు దోపిడీకి పాల్పడుతున్నట్లు గుర్తించాం. అందుకే భూభారతి పోర్టల్‌లో ఈఆడిటింగ్ తీసుకొచ్చాం. ధరణిలో అసలు ఆడిటింగ్ లేదు. అప్పటి నుంచే అక్రమం ప్రారంభమైంది. ఎక్కువగా రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ జిల్లాల్లో రెండు వేలకుపైగా లావాదేవీల్లో ఈచోరీ జరిగినట్లు తెలిసింది. తెర వెనుక ఎవరున్నా వదిలిపెట్టం. ప్రతి డాక్యుమెంట్‌నూ వడపోస్తున్నాం. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారుల పాత్రపైనా విచారణ జరుగుతోంది.

**కూపీ లాగుతున్న పోలీసులు!**
**యాదగిరిగుట్ట నిందితుడి నుంచి కీలక సమాచారం లభ్యం**

భూభారతి పోర్టల్ ద్వారా జరిగిన చెల్లింపుల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన కేసులో జనగామ, వరంగల్ సీసీఎస్ పోలీసులు కూపీ లాగుతున్నారు. జనగామ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం. ఆయా కార్యాలయాల్లో భూభారతి పోర్టల్‌లో ఎవరెవరు ఎక్కువ స్లాట్లు బుక్ చేశారనే కోణంలో ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకుల సమాచారం సేకరించారు. యాదగిరిగుట్టకు చెందిన ప్రధాన నిందితుడు.. అదే ప్రాంతానికి చెందిన ఓ విలేకరి, మరో వ్యక్తితో కలిసి దందాకు తెరతీసినట్లు సమాచారం. ఇతను పోలీసుల విచారణలో పలు కీలక విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. జనగామ పట్టణంలోని ముగ్గురు ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులతో ఇతను సన్నిహిత సంబంధాలు కొనసాగించినట్లు సమాచారం. వారు స్లాట్లు బుక్ చేసి యాదగిరిగుట్టలోని నిర్వాహకుడికి పంపిస్తే... అతను నెట్ బ్యాంకింగ్‌తో నగదు లావాదేవీలు జరిపేవాడు.

# అతితక్కువ పనిదినాల్లో రెండోస్థానం

హైదరాబాద్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకం కింద నమోదైన అత్యల్ప సగటు పనిదినాల్లో తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. ఉపాధి హామీ చట్టం 202526 సంవత్సరంలో 9 నెలల్లో 27 అత్యల్ప సగటు పనిదినాలతో ఉత్తరాఖండ్ ప్రథమ స్థానంలో నిలవగా, 28 రోజులతో తెలంగాణ రెండో స్థానంలో సాధించింది. 2025లో ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31 దాకా... ప్రతి కుటుంబానికి సగటున 28 రోజుల సగటు పనులను నమోదు చేసింది. ఇదే సమయంలో 100 రోజుల పని పూర్తి చేసిన కుటుంబాల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. తెలంగాణలో కేవలం ఆరు వేల కుటుంబాలు మాత్రమే వంద రోజుల పనిని సాధించాయి. మునుపటి సంవత్సరాలతో పోలిస్తే... ఉపాధి కల్పనలో సవాళ్లు పెరగడంతో పర్సన్ డేస్ గణనీయంగా తగ్గాయి. తెలంగాణలో దాదాపు 20 లక్షల కుటుంబాలు ఈ పథకంలో పాల్గొన్నాయి. తాజాగా 18 ప్రధాన రాష్ట్రాల నుంచి సేకరించిన డేటాను విశ్లేంచగా వివిధ అంశాలు వెల్లడయ్యాయి. వచ్చే ఏప్రిల్ 1 నుంచి ఈ ఉపాధి పథకం 'వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం'గా అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.



**అంతకు ముందూ క్షీణతే...**

2025లో ఆరునెలల కాలంలో (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ దాకా) మొత్తం ఉపాధి హామీ పని దినాల్లో 47.6 శాతం మేర (గత ఏడాదితో పోలిస్తే) తగ్గుదల నమోదైంది. తెలంగాణలో ఉపాధి కల్పన గణనీయ తగ్గుదల కనిపించే జూలైఆగస్టు నెలల్లోనే కాకుండా.. ఈసారి వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో ఏప్రిల్‌మే నుంచే ఈ క్షీణత ప్రారంభమైంది. ఈ తరువాతి నెలల్లోనూ పునరుద్ధరణ కాలేదు. ఏప్రిల్‌సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా పనిదీనాల తగ్గుదల 10.4% మాత్రమే ఉండగా, తెలంగాణలో మాత్రం దానికి నాలుగు రెట్లు అధికంగా ఉండటం ఆందోళనకరంగా మారింది. గత ఏడాది ఇదే సమయంలో ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య 25.33 లక్షల నుంచి 19.94 లక్షలకు (21.3% తగ్గుదల) తగ్గిపోయింది. అలాగే, ప్రతీ కుటుంబానికి లభించిన సగటు పని దినాలు 41 రోజుల నుంచి 27 రోజులకు పడిపోయాయి. ఒక కుటుంబానికి ఏడాదికి రూ.1,686 తక్కువ ఆదాయం (19.4%) లభించింది.

# ప్రజల ఆరోగ్యమే నా బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

పెంచుకోవాలని సూచించారు. అయితే, ప్రజల నాడి పట్టుకోవడాన్ని మాత్రం ఎప్పటికీ మర్చిపోవద్దని హితవు పలికారు.

**హెల్త్‌కేర్ హబ్‌గా హైదరాబాద్**

లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో హైదరాబాద్ ఆవిష్కరణల కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డాక్టర్లు కావాలని చాలామంది ఆశపడతారని, కానీ అందరికీ ఆ అవకాశం దక్కదని చెప్పారు. అందుకే డాక్టర్లు సమాజంలో ఒక ప్రత్యేక వర్గమని, ప్రజల ప్రాణాలు కాపాడే గొప్ప బాధ్యత మీపైన ఉందని గుర్తుచేశారు. ప్రజా ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం హెల్త్ పాలసీలను మెరుగుపరచడంలో వైద్యుల సహకారం కీలకమని, మీ సలహాలు, సూచనలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

**గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తే...**

ఇటీవలి కాలంలో గుండె జబ్బులతో మరణాలు పెరుగుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములవ్వాలని వైద్యులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు సీపీఆర్ శిక్షణను స్వచ్ఛందంగా అందించేందుకు కార్డియాలజిస్టులు ముందుకొస్తే అనేక ప్రాణాలను కాపాడగలమని చెప్పారు. చాలా సందర్భాల్లో నివారణపై నిర్లక్ష్యం చేస్తామని, కానీ ప్రజలకు అవగాహన కల్పిస్తే సమాజం మొత్తంగా లాభపడుతుందన్నారు. క్వాలిటీ ఆఫ్ హెల్త్ కేర్ విషయంలో అందరూ కృషి చేయాలని, ఆరోగ్య సంరక్షణలో భారత్.. వరల్డ్ బెస్ట్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతీ వైద్యుడు ఉత్తమంగా ఎదగాలన్నదే తన కోరికని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెలోస్ ఇండియా ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ శరత్ రెడ్డి, మెడికవర్ సీఎండీ డాక్టర్ అనిల్ కృష్ణ, మెడికవర్ సీఈవో డాక్టర్ హరికృష్ణ, మాజీ సీఎస్ఐ అధ్యక్షుడు పీసీ రథ్ పాల్గొన్నారు.

## ప్రధాన ప్రాజెక్టులకు నిధులివ్వండి

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వాలని కోరారు. శనివారం కేంద్ర బడ్జెట్ 2026–27 రూపకల్పనలో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఢిల్లీలో నిర్వహించిన బడ్జెట్ సన్నాహక సమావేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. సెస్‌లు, సర్ ఛార్జీల పేరుతో కేంద్రం అధిక మొత్తంలో ఆదాయాన్ని తన ఖాతాలో వేసుకుంటోందని, దీని వల్ల రాష్ట్రాలకు దక్కాల్సిన నిధులు అందడం లేదని అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటా దక్కాల్సి ఉండగా.. 30 శాతమే అందుతోందని చెప్పారు. ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్నుపై విధించే సర్‌ఛార్జీల ద్వారా సమకూరే రూ.1.55 లక్షల కోట్ల(2025–26 అంచనా)ను మౌలిక వసతుల అభివృద్ధి కోసం రాష్ట్రాలకు గ్రాంట్లుగా ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రాల, ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యయంలో 20 శాతానికి పైగా ఖర్చు చేస్తోందని, దాన్ని 25 శాతం తగ్గించుకుంటే ఏటా రూ.2.21 లక్షల కోట్లు ఆదా అవుతాయని, ఈ మొత్తాన్ని నిర్దిష్ట అవసరాల కోసం రాష్ట్రాలకు బదిలీ చేయాలని కోరారు. రాష్ట్రాల ద్రవ్యలోటు పరిమితిని జీఎస్‌డీపీలో కనీసం 4 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. విద్య, వైద్య రంగాల కోసం సమీకరించే నిధులను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రెండో దశ మెట్రో ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి వెంటనే ఆమోదం తెలపాలన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం, మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలు మంజూరు చేయాలన్నారు. 119 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా పాఠశాలలకు తోడ్పాటునందించాలని కోరారు.

## రాబోయే మూడు రోజులు వణుకుడే!

హైదరాబాద్

రాష్ట్రంలో శీతల గాలులు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి నుంచి ఉదయం వరకు చలి పంజా విసురుతుంటే.. ఉదయం 8–11 గంటల మధ్య, తిరిగి సాయంత్రం 5–7 గంటల మధ్య శీతల గాలులు వణికిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పలుచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.9 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 7 డిగ్రీల సెల్సియస్ ఉండగా.. 12 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు, ఎనిమిది జిల్లాల్లో 10.1–11 మధ్య, మిగిలిన జిల్లాల్లో 11.1–14 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రాష్ట్రం వైపు తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి దిగువ స్థాయి గాలులు వీస్తుండటంతో రానున్న మూడు రోజుల్లో చలితో పాటు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణశాఖ తెలిపింది.

## అధిక లాభాల ఉచ్చులో చిక్కి..

హైదరాబాద్

కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మాజీ జేడీ లక్ష్మీ నారాయణ సతీమణి ఊర్మిళ సైబర్ నేరస్తుల వలలో చిక్కారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో భారీ లాభాలు ఆర్జించవచ్చన్న నేరస్తుల మాయమాటలను నమ్మి ఏకంగా రూ.2.58 కోట్లు మోసపోయారు. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలోని స్రవంతి రెసిడెన్సీలో నివాసం ఉంటున్న లక్ష్మీ నారాయణ భార్య ఊర్మిళకు గత నవంబర్ చివరి వారంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి వాట్సాప్‌లో సందేశం వచ్చింది. స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్‌కు చిట్కాలు ఇస్తామని, అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆ సందేశం సారాంశం. అయితే ఆమెకు ట్రేడింగ్‌లో అనుభవం లేకపోయేసరికి.. తన భర్తను వాట్సాప్ గ్రూప్‌లో చేరమని సలహా ఇచ్చారు. దీంతో లక్ష్మీ నారాయణ నవంబర్ 29న 'స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్ఛేంజ్ గ్రూప్20'అనే పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో చేరారు. ఇందులో 167 మంది సభ్యులు ఉన్నారు.

**అమెరికాలో పీహెచ్‌డీ అంటూ..**

దినేష్ సింగ్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూప్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై సలహాలు ఇస్తూ మెసేజ్‌లు చేసేవాడు. 'స్టాక్ మార్కెట్ ట్రెజరీ హంటింగ్ సీక్రెట్స్' పేరుతో పుస్తకాన్ని కూడా ప్రచురించనున్నానని, ఈనెల 23న ముంబైలో ఈ కార్యక్రమం ఉంటుందని దినేష్ గ్రూప్ సభ్యులకు కల్లబొల్లి మాటలు చెప్పాడు. తాను ఐఐటీ బాంబే గ్రాడ్యుయేట్‌ని అని, అమెరికాలోని వార్టన్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశానని, జేపీ మోర్గాన్‌లో 6 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఆస్తులను నిర్వహించిన ఈక్విటీ అనలిస్ట్‌నని చెబుతూ ఓ నకిలీ లింక్‌ను పంపించాడు. అది చూసిన గ్రూప్ సభ్యులు నిందితుడిని గుడ్డిగా నమ్మారు. ఇదే సమయంలో దినేష్ 'ది వెల్త్ అలయెన్స్' అనే కాన్సెప్ట్‌ను గ్రూప్ సభ్యులకు పరిచయం చేశాడు. ఒకేరకమైన ఆలోచనలు, లక్ష్యాలు ఉన్న గ్రూప్ సభ్యులు కలిసి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే 500 శాతం రాబడులు వస్తాయని.. అదే అలయెన్స్ లక్ష్యమని నమ్మించాడు. 56 వారాల్లో 200 శాతం లాభాలు అందిస్తానని హామీ ఇచ్చాడు. సభ్యులతో ఏకీకృత బ్రోకరేజ్ ఖాతాను తెరిచాడు. మెకన్లీ బ్రోకరేజ్ సర్వీసెస్ ద్వారా మాత్రమే ఇండియన్ మార్కెట్ క్యూఐబీ ట్రేడింగ్, యూఎస్ మార్కెట్ క్యూఐబీ ట్రేడింగ్, ఐపీఓ సబ్‌స్క్రిప్షన్లను నిర్వహించాలని సూచించాడు. ఇందుకు కస్టమర్ సర్వీసెస్ మేనేజర్ అంటూ ఖైతీ అనే మహిళను పరిచయం చేశాడు. సెబీ రిజిస్టర్డ్ సంస్థ అని నకిలీ గుర్తింపు పత్రాలను చూపాడు. భారత్‌తోపాటు అమెరికా, హాంకాంగ్‌లలో ట్రేడింగ్ చేయడానికి అధికారం ఉందని వివరించాడు.

**బంగారం మీద రుణం తీసుకొని మరీ..**

గ్రూప్ సభ్యులను మూడు శ్రేణులుగా విభజించిన దినేష్.. రూ.20 లక్షల కంటే తక్కువ పెట్టుబడులు ఉన్నవారికి విక్టరీ వాన్ గార్డ్స్ టీమ్1 అని, రూ.20 లక్షల కంటే ఎక్కువ పెట్టేవారిని విక్టరీ వాన్ గార్డ్స్ టీమ్2 అని, అత్యధిక పెట్టుబడులు పెట్టేవారిని క్లోజ్డ్ డోర్ డిస్‌ప్లే టీమ్ అని పేర్లు పెట్టాడు. గ్రూప్ సభ్యులకు వ్యక్తిగతంగా ఒకరితో ఒకరు మార్గదర్శకత్వం అందిస్తామని మాయమాటలు చెప్పాడు. గ్రూప్ సభ్యులు అధిక లాభాలు పొందేందుకు పెట్టుబడులు పెంచాలని.. లేకపోతే లాభాలు కోల్పోతారని భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో ఊర్మిళ పెట్టుబడుల మొత్తాన్ని పెంచారు. ఈ2ఈ రైల్, గాబియన్ టెక్నాలజీస్ ఐపీఓలలో పాల్గొనాలని, పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయాలని సూచించాడు. 300 శాతం లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో గుడ్డిగా నమ్మిన ఊర్మిళ.. బంగారం మీద రుణం తీసుకొని మరీ పెట్టుబడులు పెట్టారు. ఒకవైపు అత్యాశ వద్దని భర్త హెచ్చరించినా పట్టించుకోకుండా ఆమె పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయడం గమనార్హం. పెట్టుబడుల కోసం నిందితులు పశ్చిమ బెంగాల్, అస్సాం, ఒడిశా, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు చెందిన కరెంట్ ఖాతా నంబర్లను అందించారు. దీంతో అనుమానం కలిగిన ఊర్మిళ.. ఇంటర్నెట్‌లో సెర్చ్ చేశారు. వాట్సాప్ ఆధారిత పెట్టుబడి మోసాల గురించి పలు నివేదికలను చూశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 6న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 111(2)(బీ), 318(4), 319(2), 336(3), 338, 340(2)లతో పాటు ఐటీ చట్టంలోని 66సీ,డీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఒక్క రోజే రూ.38 లక్షలు..**

ఊర్మిళ తన భర్త పేరు, వివరాలతో 'మెక్కీ సీఎం' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ట్రేడింగ్ ఖాతాను ప్రారంభించారు. గ్రూప్‌లో ఇచ్చిన సూచనల మేరకు మెకిన్లీ ట్రేడింగ్ ఖాతాలోకి సొమ్మును బదిలీ చేశారు. గత డిసెంబర్ 24న తొలుత రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. అప్పట్నుంచి ఈనెల 5 వరకు 19 దఫాలుగా మొత్తం రూ.2.58 కోట్లు పెట్టారు. డిసెంబర్ 26న ఒక్క రోజే ఏకంగా రూ.38 లక్షలు పెట్టారు. బాధితురాలి యాక్సిస్ బ్యాంక్ ఖాతా నుంచి నిందితులకు చెందిన సీబీఐ బ్యాంక్‌లోని కంపాకోలా బెవరేజెస్ ఖాతాకు ఈ సొమ్మును బదిలీ చేశారు.

